"షిడ్నీ షెల్డన్ అనే ఇంగ్లీషు రైటర్ వ్రాసిన రెండు నవలలు కలిపి 'తలంబ్రాలు' రాశాను. నిర్మాత మీద కేసుపెడితే, తనూ ఆ ఇంగ్లీష్ నవలల ఆధారంగా ఆ చిత్ర కథని అల్లానని చెబితే పరువేం కావాలి?"

* * *

ఇప్పుడు నేను ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ముగ్గురిలో ఒకడిని. అంటే అర్థం అయింది కదా?

## ఇల్లు అద్దెకు ఇవ్వబడును

ఆ బోర్డు కామేశ్వరరావు కళ్ళకి కల్పవృక్షంలాగానో, కామధేనువు లాగానో కనపడింది. నల్లటి రంగు పూసిన రేకుమీద తెల్ల అక్షరాల్లో తెలుగులో రాయబడి ఉంది.

"ఇల్లు అద్దెకు ఇవ్వబడును. వివరాలకు మేడమీద"

కామేశ్వరరావు సిటీ బస్‌లోంచి దిగేశాడు. తను దిగాల్సిన బస్ స్టాప్‌లు ఆరు వున్నా ఆ ఇంటి మేడ మెట్లు ఎక్కడో కనుక్కొని సరాసరి పైకెళ్ళి కాలింగ్ బెల్ నొక్కాడు.

ఒక అరవై ఏళ్ళ ముసలావిడ తలుపు తెరిచింది.

"ఎవరు కావాలి?" అడిగింది అతన్ని ఎగా దిగా చూసి.

"ఇల్లు అద్దెకుందని బోర్డు చూశాను...."

ఆవిడ తల వూపి లోపలికి రమ్మన్నట్లు సౌంజ్ఞ చేసింది. ఆవిడ లోపలి గదిలోకి వెళ్ళి అరనిముషంలో ఆవిడకన్నా వృద్ధుడుగా కనిపించే ఒకాయనతో వచ్చింది.

"ఎక్కడ పనిచేస్తున్నావ్?" అడిగాడాయన.

"ఎల్. ఐ. సి లో"

"కూర్చో"

ఎల్. ఐ. సి. పేరు విన్నాక ఆయన మొహం కొద్దిగా ఉదాసీనంగా మారింది.

"ఎంత జీతం?"

"పద్నాలుగు వందలు చేతికివస్తాయి నేను మా చెల్లెళ్ళిద్దరు ఉంటాం. ఇంకా పెళ్ళి కాలేదు. మూడు గదులుండాలి, వంటగదితో కలిపి. ఎప్పుడైనా మా అమ్మ వస్తూంటుంది. చెల్లెళ్ళిద్దరూ చదువుతున్నారు ఆరో తరగతి ఎనిమిదో తరగతి" తన వివరాలు గబగబా చెప్పాడు కామేశ్వర రావు.

"వెజిటేరియన్సేగా?"

తలవూపాడు.

ముందుభాగం చూడు నాయనా" చెప్పింది ఇంటావిడ. ఆవిడే తీసుకెళ్ళి చూపించింది. విశాలమైన గదులు. పెద్ద కిటికీలు. చక్కటి వెటింలేషన్. సున్నం కొట్టి అట్టే రోజులు కాలేదన్నగుర్తుగా సున్నం వాసన.

"మీ చెల్లెళ్ళకి వంట వచ్చా?" అడిగింది.

"వచ్చు మామ్మగారు గేస్ స్టవ్ ఉంది."

"పెళ్ళెందుకు చేసుకోలేదు బాబూ?"

"సంబంధాలు చూస్తున్నారు మా అమ్మగారు"

మళ్ళీ ముందు గదిలోకి వచ్చారు.

"అద్దె నాలుగు వందలు కరెంట్ నీళ్ళకి నెలకు పదిహేను అదనముగా యివ్వాలి, రోజు విడిచి రోజు మీ పనిమనిషి మెట్లు వూడవాలి." చెప్పాడు ముసలాయన.

"అలాగే సర్" నాపేరు కామేశ్వరరావు.

"ఇంటిని శుభ్రముగా వుంచాలి నాయనా" చెప్పింది ముసలావిడ.

జేబులోంచి నాలుగువందలు తీసి ఆయన చేతిలో వుంచి అన్నాడు.

"రెండవ తారీఖు మంచిరోజు. ఆ రోజు సాయంత్రం ప్రవేశిస్తామండి"

"అలాగే"

రెండవతారీఖు ఉదయం ఎల్. ఐ. సి. కి వచ్చాడు ఆ ఇంటాయన. కామేశ్వరరావు సీటు దగ్గరికి వెళ్ళి అతని చేతిలో మాట్లాడకుండా నాలుగు వందలు ఉంచాడు.

"ఇదేమిటి?" సంభ్రమంగా అడిగాడు కామేశ్వరరావు.

"నీకు ఇల్లు ఇవ్వటంలేదు. మరో పది తక్కువయినా ఇంకొకరికి ఇచ్చేశాం"

"ఎందుకు? ఎందుకు?" గొణిగాడు కామేశ్వరరావు.

"మా పక్కింటావిడ నిన్న గుర్తుపట్టి చెప్పబట్టి సరిపోయింది లేకపోతే...."

"ఏం చెప్పింది?"

"ఈ వారం పత్రికలో నీ ఫోటో అచ్చయిందటగా? నువ్వు రచయితవని చెప్పింది, బ్రహ్మచారులకయినా ఇస్తాంకాని రచయితలకి ఇల్లు ఇవ్వను" వెళ్ళిపోయాడాయన.

## ఓ ఇంటి కథ

శ్రీవారు ఇంటికిరాగానే ఆయన కోటు విప్పుతూ చెప్పింది సరసీరుహ.

"మంటూ ఏం చేసాడో చూసారా?"

మంటూ వారి ప్రథమ సంతానం. పేరు గౌరవ్. కాని చిన్నప్పుడు పెట్టిన ముద్దుపేరు "మంటూ" పెద్దయినా పోలేదు. బయటవాళ్ళు గౌరవ్‌గా పిలుస్తారు.

"ఏం చేసాడు?" అడిగాడు సరసీరుహ భర్త.

ఆవిడ టేబిల్ మీదవున్న టేబిల్ లేంప్‌ని చూపించింది.